మేల్కొనకపోతే ముప్పే

- అధికశాతం పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం
- బానిసై.. ఉజ్వల భవిష్యత్‌కు దూరమౌతున్న వైనం
- మానసిక, శారీర ఎదుగుదల మందగమనం
- ఇంటి నుంచే మార్పునకు శ్రీకారం చుడితేనే..
- భవిష్యత్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి
- నేడు జాతీయ బాలల దినోత్సవం

6లో



అప్రమత్తతే మందు



- జిల్లాలో పెరుగుతున్న మధుమేహం రోగుల సంఖ్య
- మారుతున్న జీవనశైలి, ఆపై నిద్రలేమి కారణం
- టైపు - 2 బాధితులు అధికం.. ● నేడు వరల్డ్ డయాబెటిస్ డే



బెలగాం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మధుమేహం(డయాబెటిస్) రోగుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, మానసిక ఒత్తిడి తదితర కారణాలతో డయాబె టిస్ రోగులు పెరుగుతున్నారని వైద్యులు చెబుతున్నారు. షుగర్ వచ్చిందని భయపడొద్దని, ముందు జాగ్రత్త పాటిస్తే మేలని స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం 'వరల్డ్ డయాబెటిస్ డే' సందర్భంగా జిల్లాలో మధుమేహం లక్షణాలు, నివారణ చర్యలు.. వైద్యులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో ఎన్‌సీడీ 3.0 సర్వే ద్వారా 41,042 మందికి డయాబెటిస్ లక్షణాలు ఉన్నట్లు తేలింది. జిల్లా వ్యాప్తంగా 5,61,275 మందికి చేసిన పరీక్షలు నిర్వహించారు. 41,042 మందికి డయాబెటిస్ లక్షణాలు గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నారు.

డయాబెటిస్ అంటే..

శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు (బ్లడ్ షుగర్ లెవెల్స్) ఎక్కువగా ఉంటే డయాబె టిస్ వస్తుంది. మన శరీరంలో ఇన్సులిన్ అనే పదార్థం మన ఆహారంలో ఉన్న చక్కెరను శరీరానికి అవసరమైన శక్తిగా మార్చు తుంది. అది తగ్గిపోయినా లేదా పనిచేయకపోయినా చక్కెర రక్తంలో చేరి ఎక్కువ అవుతుంది. దానినే 'డయాబెటిస్' అంటారు. శరీరంలో ఇన్సులిన్ లేకపోవడం టైప్-1గా, ఇన్సులిన్ ఉన్నా పనిచే యకపోవడాన్ని టైప్-2 డయాబెటిస్‌గా గుర్తిస్తారు.

- టైప్-1 డయాబెటిస్ : ఇది సాధారణంగా పిల్లల్లో, యువతలో ఎక్కువగా కనిపిస్తుంది. శరీరం ఇన్సులిన్ ఉత్ప త్తి చేయడం పూర్తిగా ఆపేస్తుంది. కాబట్టి ఈ రకం రోగులు రోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. ఇది ఎక్కువ హెరి డటరీ కారణంగా వస్తుంది. దీన్ని 'ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్' అంటారు.
- టైప్ 2 డయాబెటిస్: ఇది పెద్దవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇన్సులిన్ శరీరంలో తయారవుతుంది. కానీ జీవనశైల్లిలో మార్పులు కారణంగా అది సరిగ్గా పనిచేయ ఎదు. ప్రధాన కారణాలు ఏమిటంటే.. ఆహారంలో ఎక్కువ చక్కెర, కొవ్వు ఉండడం (మిగతా 8వ పేజీలో..)

అవగాహన ఉండాలి..



నేటి ఉరుకుల పరుగుల జీవన శైలిలో డయాబెటిస్ బారిన ఎక్కువ మంది పడుతున్నారు. డయాబెటీస్ ఒక్కసారి వస్తే నయం కాదు. కానీ నియంత్రణలో ఉంచుకోవచ్చు. దానికోసం ఈ వ్యాధి ఉన్న వారు ప్రతిరోజు వ్యాయామం చేయాలి. ఎక్కువగా నీరు తాగాలి. ఆకుకూరలు తినాలి. ఆయిల్ పదార్థా లు తగ్గించాలి. మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. జిల్లాలో డయాబెటీస్ రోగులకు 104 సంచా ర వాహనాల ద్వారా ప్రతి నెల వారి ఇంటి వద్దనే మందులు ఇస్తున్నాం. ఏఎన్‌ఎంలు, ఆశాల ద్వారా ఇంటి వద్దే వారికి చికిత్స అందిస్తున్నాం. 42 పీహెచ్‌సీల్లో పరీక్షలు చేస్తున్నాం. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎన్‌సీడీ-4.0 సర్వే జరుగుతుంది. ఇంకా డయాబెటీస్ రోగులు పెరిగే అవకాశం ఉంది.

-డా.జగన్మోహన్‌రావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి

దీర్ఘకాలిక సమస్యలకు మోక్షమెప్పుడో!

- పార్వతీపురంలో బైపాస్ రహదారి నిర్మాణం ఎప్పటికో..
- నిధులు మంజూరైనా.. సాగని పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం
- కొలిక్కిరాని ఒడిశా వివాదం.. పూర్తికాని జంఝావతి పెండింగ్ పనులు
- ఇబ్బందుల్లో ప్రజలు, రైతులు .. కూటమి ప్రభుత్వంపై ఆశలు



నిలిచిన పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు

పార్వతీపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాను దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. ఎన్నికల హామీలుగానే మిగిలిపోతుండడంతో ప్రజలకు అవస్థలు తప్ప డం లేదు. జిల్లా కేంద్రంలో బైపాస్ రహదారి నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. నిధులున్నా.. కురు పాం నియోజకవర్గంలో పూర్ణపాడు- లాబేసు వంతెన నిర్మాణం ముందుకు సాగడం లేదు. మరోవైపు జంఝావతి పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వాటిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి.. పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



వాహనాల రద్దీతో పార్వతీపురం పట్టణం (ఫైల్)

జిల్లాకేంద్రంలో..

జిల్లా కేంద్రం పార్వతీపురంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జటిల మవుతోంది. భారీ వాహ నాలు ప్రయాణించే సమయంలో వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రధాన రహదారిలో ఎక్కడిక్కడే వాహనాలు నిలిచిపోతుండడంతో పాదచారులు కూడా రాక పోకలు సాగించలేకపోతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బైపాస్ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు వెళ్లా యి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీన్ మారింది. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. అయితే ప్రభు త్వం నుంచి ఇప్పటి వరకు బైపాస్ రహదారి (మిగతా 8వ పేజీలో..)

వారు లేరు.. వీరు రారు?

- సీతంపేట ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత
- చర్మ, నేత్ర, సివిల్ సర్జన్ విభాగాల్లో పోస్టులు ఖాళీ
- మెడికల్ లీవ్‌లో చిన్నపిల్లల డాక్టర్లు
- రోగులకు తప్పని ఇబ్బందులు ● చిన్నపిల్లల పరిస్థితి దయనీయం

సీతంపేట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరి యా ఆసుపత్రిలో కీలక విభా గాల్లో వైద్యుల కొరత నెలకొంది. దీంతో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఆస్పత్రిలో వందల సంఖ్యలో ఓపీ నమోదవుతుంది. సీతంపేట ఏజెన్సీతో పాటు కొత్తూరు, భామి ని, బత్తిలి, హిరమండలం తది తర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు సీతంపేట ఆసుపత్రికి వస్తుంటారు. అపడ మిక్ సీజన్‌లో ఏకంగా 400 వరకు ఓపీ నమోదవుతుం టుంది. అయితే, వైద్యుల కొరత తో రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదనే విమర్శ లు ఉన్నాయి. మొత్తం 21మంది వైద్యులకు గాను 18 మంది ఉన్నారు. చర్మ(డెర్మటాలజీ) (మిగతా 8వ పేజీలో..)



సీతంపేట ఏరియా ఆసుపత్రి



అనారోగ్య సమస్యలతో ఏరియా ఆసుపత్రికి వచ్చిన చిన్నారులు

జ్వరంతో బాలుడి మృతి..



మృతి చెందిన బాలుడు (ఫైల్)

సోమగండి పంచాయతీ పెద్ద గూడ గ్రామానికి చెందిన నాలుగు నెలల బాలుడు జ్వరంతో గురువారం మృతిచెందాడు. పెద్దగూడకు చెందిన సవర రాజేంద్ర, సౌందర్య రెండో సంతానంగా బాలుడు జన్మించాడు. ఈనెల 9న బాలుడికి జ్వరం రావ డంతో తల్లిదండ్రులు మంగళవారం రాత్రి సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ బాలుడిని పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. బాలుడు మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

చెడు వ్యసనాలకు బానిసై

- బంగారమ్మపేటలో దొంగతనం ● ముగ్గురు నిందితుల అరెస్టు
- రూ.32వేల నగదు, 6.5 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. గురువారం వారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రూ.32వేల నగదు, 6.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ అప్పలనాయుడు వివరాల మేరకు.. పట్టణంలో బంగారమ్మ పేటలో నివాసం ఉంటున్న దేవుపల్లి వెంకటరావు ఈ నెల 7న పెందుర్తిలో ఉన్న తన కూతురి ఇంటికి భార్య లక్ష్మితో కలిసి వెళ్లాడు. 9వ తేదీ ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ఆయన పక్కింటిలో నివాసముంటున్న బూరాడ శేఖర్.. వెంకటరావుకు ఫోన్ చేసి 'మీ ఇంటిలో దొంగలుపడ్డారు' అని చెప్పాడు. దీంతో ఇంటికి చేరుకున్న వెంకటరావు బీరువాను తనిఖీ చేయగా అందులో 7 గ్రాముల బంగారు నగలు, రూ.37వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గురువారం సాలూరు పట్టణం నుంచి జీగిరాంవైపు స్కూటీపై వెళ్తున్న బంగారమ్మకాలనీకి చెందిన బొత్స నవీన్, కోడూరు కార్తీక్, మాడుగల వంశీ కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. చెడు అలవాట్లకు బానిసగా మారి దొంగతనం చేద్దామనే ఉద్దేశంతో బంగారమ్మపేటలో తాళం వేసి ఉన్న వెంకటరావు ఇంటికి వెళ్లి స్క్రూ డ్రైవర్, జాకీరాడ్డు సహాయంతో తాళాలు, బీరువాను పగలగొట్టి చోరీ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.32 వేల నగదు, 6.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ అనీల్, పోలీసు సిబ్బంది అప్పన్న, చంద్రశేఖర్‌ను సీఐ అభినందించారు.

అరకు నుంచి యలహంకికి ప్రత్యేక రైలు

- పుట్టపర్తి శ్రీసత్యసాయి భక్తుల్లో ఆనందం
- ఈనెల 13, 14, 23, 24న రాకపోకలు

6లో



ఆకట్టుకున్న శబరిమలై సెట్

- అంబరాన్ని అంటిన అయ్యప్ప అంబలం పూజ

6లో



చెరువు ఆక్రమణ తొలగింపునకు చర్యలు

6లో

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- పోలీసు స్టేషన్లలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలి ● ఎస్పీ మాధవ్‌రెడ్డి



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ

పాలకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సబ్ డివిజన్‌ల పరిధిలో చర్యలు చేపట్టాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. పాలకొండ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ ప్రయోగమూర్తి ఎస్పీని ఆహ్వానించారు. అనంతరం పోలీస్ గౌరవవందనం స్వీకరించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసుల దర్యాప్తు ఏ విధంగా జరుగుతుందని ఆరా తీశారు. గంజాయి, సారా అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి తగిన ఆదేశాలు, మార్గదర్శకాలు చేయాలని డీఎస్పీకి సూచించారు. పోలీస్ స్టేషన్‌లలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీరఘట్టం ఎస్‌ఐ కళాధర్, ఎల్విన్‌పేట సీఐ హరి, చినమేరంగి ఎస్‌ఐ అనీష్, నీలకంఠాపురం ఎస్‌ఐ నీలకంఠం, సీసీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ● ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

సాలూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదే శించారు. పట్టణంలో ఏఎంసీ ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారం భించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులను ఇబ్బంది కలిగేలా అధికారులు ప్రవర్తించవద్దని, వారి సంక్షేమానికి ప్రభు త్వం కట్టుబడి ఉందని తెలిపారు. 'గత ప్రభుత్వం మాదిరి కాకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తాం. రైతుల కు కావాల్సిన గన్నీబ్యాగులు, రవాణా ఖర్చు లు ప్రభుత్వమే చూసుకుంటుంది. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తాం. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా 1967 టోల్‌ఫ్రీ నెంబరు కు ఫోన్ చేయాలి. జిల్లాలో 461 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. రైతు బజారును వినియోగంలోకి తీసుకుని వచ్చే లా అధికారులు చర్యలు చేపట్టాలి. ఎరువుల వాడకం మోతాదును తగ్గించాలి. దీనిపై రైతులకు అధికారులు అవగాహన కల్పించా లి. త్వరలోనే పత్తి కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తాం.' అని మంత్రి తెలి పారు. జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 3.30 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 104 మిల్లర్లతో మాట్లాడడం జరిగిందన్నారు. ధాన్యాన్ని తరలించేందుకు 1042 వాహనాల కు ఇప్పటికే జీపీఎస్‌లను అనుసంధానం చేశామన్నారు. ఒకవేళ దళారుల వద్ద అధిక డబ్బులు వస్తే అక్కడైనా అమ్ముకోవచ్చునని, ఆ విషయాన్ని సమీపంలో ఉన్న రైతు భరో సా కేంద్రానికి తెలియజేయాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సంబంధిత అధికారులను నేరుగా సంప్ర దించవచ్చునన్నారు. ధాన్యంలో 13 నుంచి 17 వరకు తేమశాతం ఉండేలా చూసుకో వాలని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా వ్యవసాయాధికారి అన్న పూర్ణ, ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారా యణ, పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మేల్కొనకపోతే ముప్పే



బొబ్బిలి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):

నేటి తరం పిల్లల్లో చాలామంది సెల్‌ఫోన్లకు బానిసలు అవతున్నారు. వారికి విలువలు నేర్పేవారు కరువౌతున్నారు. తల్లిదండ్రులకు పిల్లలను పట్టించుకునే సమయం లేకపోవడం.. ఉపాధ్యాయులూ పాఠ్యపుస్తకాలకే పరిమితం కావడమే ప్రధాన కారణాలు. ఇవే పిల్లలు దారి తప్పేలా చేస్తున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే.. భవిష్యత్ ప్రశ్నార్థకం అవు తుందని వారు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన భావి సమాజం రూపకల్పన చేయాలంటే బాలలు శారీరకంగా.. మానసిక ఆరోగ్యంగా ఉండాలి. ఇందుకు క్రీడలు, సంగీతం, వ్యాయామం, నీతికథలు వంటి వాటిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలియజేయాలి. పిల్లలు హృదయం పలక లాంటి దంటారు. దానిపై రాసే విధానాన్నిబట్టే ఎ దుగుతారు. కుటుంబ సమస్యలు, పెద్దల పర్యవేక్షణ లేకపోవడం, చెడు స్నేహాలు, సరైన మార్గదర్శకం లేకపో వడం వల్ల పిల్లలు దారితప్పే ప్రమాదం ఉంది. శుక్రవా రం జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం..

ప్రతి ఇంట్లో ఒకటికి మించి సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. ఇంటర్నెట్ సైతం చౌకగా లభించడంతో ఓటీటీల వినియోగం పెరిగింది. ఫలితంగా పిల్లలు హర్రర్ సినిమాలు, ఇతర షోలను చూస్తేస్తున్నారు. ఇవే పిల్లల్లో నేరప్రవత్తికి బీజం పడేలా చేస్తున్నాయని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ విద్యార్థి తరగతి గదిలో ఉపాధ్యాయుడితో డబ్బు 'సంపాదించాలంటే చదువే ఎందుకు సార్. రీల్స్ చేసి పేరు తెచ్చుకుంటే సరిపోతుంది' అని చెప్పడాన్ని చూస్తే సోషల్ మీడియా ప్రభావం ఎంతనష్టం కలిగిస్తుందో తెలుస్తోంది.

తల్లిదండ్రుల్లో మార్పు వస్తేనే..

- పిల్లలకు రోజూ లేదా వారాంతంలో కొంతసమయం కేటాయించి వారితో గడపాలి.
- సమాజంలో జరిగే తప్పొప్పులు, వాటి ప్రభావాల్ని వివరిస్తుండాలి.
- వారి మనసులో ఇతరులు, సమాజంపై ఎలాంటి భావనుందో తెలుసుకోవాలి.
- ఈర్ష్య, అసూయ, కోపం వల్ల అనర్థాలు వివరించాలి.
- టీవీల్లో, ఫోన్లో వారు వేటిని ఆసక్తిగా చూస్తున్నారు? ఏం వెతుకున్నారు? అనేది గమనించాలి.
- హర్రర్ సినిమాలు, క్రైంస్టోరీల సన్నివేశాల విషయంలో ఆసక్తిని గుర్తిస్తే అలాంటి వాటిని చూడటం వల్ల నష్టాలను వివరించాలి.
- తీవ్ర పవర్తన ఉంటే బెదిరించడం, కొట్టడం ద్వారా కాకుండా నీతికథలు, గొప్ప వ్యక్తుల జీవన విలువల్ని తెలియజెప్పుతూ మంచిని నేర్పాలి.
- పరిస్థితి చేయిదాటిందని భావిస్తే వెంటనే మానసిక నిపుణుల దగ్గరకు తీసుకువెళ్లాలి.
- 15 ఏళ్లలోపు వారికి వ్యక్తిగత మొబైల్ ఇవ్వడం పెద్దతప్పు. చదువుకు అవసరమైతే అది పెద్దల పర్యవేక్షణలో ఉండాలి.
- ఫిజికల్ యాక్టివిటీలను ప్రోత్సహించాలి. బయట ఆడుకోవడం, బృందకార్యాకలాపాలు అలవాటు చేయాలి.
- నిజాయితీ, సమయపాలన, పెద్దలకు గౌరవం, సహాయం చేయడం వంటి విలువలు రోజువారీ చర్యల్లో నేర్పించాలి.

ఉపాధ్యాయులూ పాత్ర ఉంది..

- ఉపాధ్యాయులు స్వయంగా ప్రతి చిన్నపనికి మొబైల్ వాడకూడదు. క్లాస్‌లో పుస్తకాలు, చర్చలు, గేమ్స్ ప్రాజెక్టుల ద్వారా బోధన చేయాలి.
- పిల్లలకు డిజటల్ డిసిప్లిన్ నేర్పించడం అంటే రోజులో ఎంతసేపు వాడాలి, ఏ యాప్‌లు మంచివి.. హానికరమని అవగాహన చేయాలి. స్ర్కీన్ టైమ్‌చార్ట్ లాంటి చిన్న ప్రాజెక్టులు తరగతిలో నిర్వహించాలి.
- విద్యార్థులతో మాట్లాడడం.. వారి చెప్పింది వినడం అనే బంధాన్ని పెంచాలి. ఉపాధ్యాయులు తరగతి తర్వాత 5-10 నమిషాలు పిల్లలతో వ్యక్తిగతంగా మాట్లాడాలి. ఎవరు ఏ హాబీలు కలిగి ఉన్నారో గుర్తించి వాటిని ప్రోత్సహించాలి.
- పాఠశాలలో మొబైల్ ఫ్రీడే వారంలో ఒక రోజు నిర్వహించాలి. తల్లిదండ్రులకు అవగాహన కార్యాక్రమాలను పెట్టాలి.
- ప్రేరణాత్మక ఉదాహరణ చూపించాలి. అంటే ఉపాధ్యాయుడు కూడా పాఠశాలల్లో తరగతిలో, విరామంలో, సమావేశాల్లో మొబైల్‌లో తక్కువ సమయంగడిపితే విద్యార్థులకు ఆచరణగా మారుతుంది. అంటే ఉపాధ్యాయులు పాటించాలి.. చూపించాలి. అలవాటు చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తే 60శాతం వరకు పిల్లల్లో మార్పు వస్తుందని మానసిక శాస్త్రనిపుణులు చెబుతున్నారు.


అధికారిణి అయినా ఓ బిడ్డకు తల్లిగా...
బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి


వినూత్నంగా బోధన సాగిస్తున్న ఉషారాణి

అతిగారాబం ప్రమాదం..

అతిగారాబంతో కొందరు తల్లిదండ్రులు.. పిల్లలు ఏం చేసినా సమర్థిస్తున్నారు. ఇదే వారిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అత్యధికులు కనీసం మందలించట్లేదు. కోరినవన్నీ ఇచ్చేస్తున్నారు. దీంతో బాలలు సరిగా వినియోగించడం తెలియక విపరీతంగా ప్రవర్తిస్తున్నారు. బడిఈడులోనే గాడితప్పుతున్నారు.

పిల్లల కోసం సమయాన్ని కేటాయించాలి..



ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగై పోయింది. ఈ సమయంలో పిల్లల కోసం తల్లిదండ్రులు కచ్చితంగా సమయాన్ని కేటాయించాలి. వారి చేతిలో మొబైల్ ఫోన్లు పెట్టి చేతులు దులుపుకుంటే మన చేతికి దక్కకుండా పోతారు. మున్సిపల్ కమిషనర్‌గా నేను ఎప్పుడూ బిజీగానే ఉంటాను. నాకు ఇద్దరు పిల్లలు. వారిద్దరినీ మొబైల్ ఫోన్లకు దూరంగా పెంచగలుగుతున్నాను. ఆటలు, డ్రాయింగ్, ఇతర కార్యకలాపాల పట్ల ఆసక్తిని కలిగించాను. వారితో గడపడానికి కచ్చితంఒగా సమయం కేటాయిస్తాను.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

మొబైళ్లకు బానిస అయితే అంతే..

పాలబుగ్గలల చిన్నారులందరిలో వికాసాన్ని పెంచాలి. చాలా మంది చిన్నారులు ఇళ్లవద్ద మొబైల్‌ఫోన్లకు ఎడిక్ట్ అయిపోవడంతో మూడేళ్లు దాటుతున్నా మాట్లాడలేకపోతున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. వారి మానసిక ఎదుగుదల బాగుండాలంటే ఫోన్లకు దూరంగా వారిని పెంచాలి. బాలల దినోత్సవం, ఇతర ముఖ్యమైన పర్వదినాలలో చిన్నారులందరినీ జాతీయనాయకులుగా, సాంప్రదాయ వస్త్రధారణలతో ప్రదర్శనలు ఇప్పించాలి. ఆటపాటలతో అలరింపజేయాలి. మేము అదే పని చేస్తున్నాము.

-జె.విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీవో, బొబ్బిలి

వినూత్న తరహా బోధనతో ఆసక్తి పెంచాలి..

పిల్లలకు బోధన వినూత్న తరహాలో ఉండాలి. ఆటపాటల ద్వారా పాఠ్యాంశాలను బోధించాలి. అప్పుడే విద్యార్థులకు ఆసక్తి కలిగించగలం. మేము మొబైల్‌ఫోన్లలో అనవసరమైన వాటి నుంచి పిల్లల దృష్టిని మరల్చుతున్నాం. అక్షరమాలపై సొంతంగా పాటలు రూపొందించి బోధిస్తున్నాము. అప్పుడప్పుడూ వ్యవసాయం, పోలీసు, రెవిన్యూ, ఇంజనీరింగ్ అధికారులు, యోగా టీచర్‌ను రప్పించి వారితో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.

-చిట్టి మోజు ఉషారాణి, తారకరామాకాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, బొబ్బిలి

తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి..



చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లల మానసిక ఎదుగుదల, ప్రవర్తనపై వాటి ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. స్మార్ట్‌ఫోన్లు అతిగా వినియోగించడం వల్ల దృష్టిలోపం, నిద్ర సమస్య వస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గి చదువు దెబ్బతింటుంది. ఫోన్లకు ఎడిక్ట్ అయితే స్నేహితులు, కుటుంబసభ్యులతో సంబంధాలు లేకుండా పోతాయి. ఫోన్లను వాడకుండా పిల్లలకు ప్రత్యామ్నాయ కార్యకలాపాల పట్ల మొగ్గుచూపేలా తల్లి దండ్రులు బాధ్యత వహించాలి.

-డాక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్, విజయనగరం

అరకు నుంచి యలహంకికి ప్రత్యేక రైలు

● పుట్టపర్తి శ్రీసత్యసాయి భక్తుల్లో ఆనందం ● ఈనెల 13, 14, 23, 24న రాకపోకలు


ఎస్.కోట రైల్వే స్టేషన్‌లో ఆగిన అరకు-యలహంకి ప్రత్యేక ట్రైన్


భక్తులకు ఆహార పొట్లాలు అందిస్తున్న స్థానిక శ్రీసత్యసాయి సేవాకమిటి సభ్యులు

శృంగవరపుకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నుంచి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సమీపాన ఉన్న యలహంకికి రైల్వేశాఖ ప్రత్యేక రైలు నడపడంతో పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 13న అరకు నుంచి యలహంకి, తిరిగి ఈనెల 14న యలహంకి నుంచి అరకు, అలాగే ఈనెల 23న అరకు నుంచి యలహంకి, తిరిగి ఈనెల 24న యలహంకి నుంచి అరకుకు ప్రత్యేకంగా రాకపోకలు సాగించేలా రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ఈనెల 23న పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబ శతజయంతి ఉత్సవం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సత్యసాయిబాబా జయంతిని అధికారకంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకులకు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు సేవ చేసేందుకు సత్యసాయిబాబా శిష్యులు, ఆరాధికులు అధిక సంఖ్యలో పుట్టపర్తికి చేరుకుంటారు. ఒడిశా సరిహద్దులో ఉన్న అల్లూరి సీతారామరాజు గిరిజన జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లా వరకు పుట్టపర్తి సాయిబాబాకు లక్షలాది భక్తులు ఉన్నారు. వారం రోజుల పాటు అక్కడే ఉండి బాబా జయంతి కార్యక్రమం జరుపుకుంటారు. భక్తులకు సేవ చేస్తారు. అయితే పుట్టపర్తి వెళ్లేందుకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు వరకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉంది. బాబా జయంతికి వెళ్లే భక్తులందరికీ బెర్తులు దొరకడం లేదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైల్వేశాఖ బాబా శతజయంతి ఉత్సవాలకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసింది. ఈ రైలు గురువారం అరకు నుంచి కదిలింది. శృంగవరపుకోట రైల్వే స్టేషన్‌కు మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకుంది. పుట్టపర్తికి భక్తులకు శ్రీసత్య సాయి జిల్లా కమిటీ సూచన మేరకు స్థానిక కమిటి సభ్యులు ఆహార పొట్లాలు అందించారు. కమిటీ సభ్యుడు డాక్టర్ రంధి త్రినాధరావు వెయ్యి ఆహార పొట్లాలను అందించినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న శబరిమలై సెట్

● అంబరాన్ని అంటిన అయ్యప్ప అంబలం పూజ


అయ్యప్ప ఆలయం తరహాలో వేసినసెట్


మెట్లు దిగుతున్న అయ్యప్ప వేషాదారణలో మణికంఠ


ఐస్ గడ్డలతో తయారుచేసిన శివలింగం

విజయనగరంకల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శబరిమలైలోని అయ్యప్పస్వామి ఆలయం తరహాలో భారీ సెట్ వేశారు. అక్కడున్నట్టే అయ్యప్పవిగ్రహాలతో పాటు గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, శివయ్య ప్రతిమలను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఇద్దరు బాలలు అయ్యప్పస్వామి వేషధారణలో కనిపించడం మరింత ఆకర్షణగా నిలిచింది. డెంకాడ మండలం గుణుపూరుపేటలో బుధవారం రాత్రి జరిగిన అంబలం పూజ వద్ద కనిపించిన దృశ్యాలివి. గ్రామానికి చెందిన యడ్ల రాంబాబు పద్దెనిమిదవసారి అయ్యప్ప మాలాధారణ చేయడంతో భారీగా పూజ ఏర్పాటు చేశారు. ఐస్ గడ్డలతో తయారుచేసిన శివలింగం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

చెరువు ఆక్రమణపై చర్యలు

భోగాపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెపువలస గ్రామం ఎయిర్‌పోర్టు సమీపాన ఉన్న చెరువు ఆక్రమణను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఈనెల 12న 'జాగా కనిపిస్తే పాగా' అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడడంతో దీనికి స్పందించిన తహసీల్దార్ రమణమ్మ అక్రమణకు గురైన చెరువును పరిశీలించారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వీఆర్వో వాక్‌దేవి ఆధ్వర్యంలో గురువారం పూడ్చేసిన చెరువులో వేసిన ఫెన్సింగ్‌ను తొలగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చెరువులో వేసిన పెన్సింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం

కార్యకర్తలే టీడీపీ బలం

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గం క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండల పార్టీల అధ్యక్షులు బోను దేవిచంద్రమౌళి, పెంకి వేణుగోపాలనాయుడు, గొట్టాపు వెంకటరమణ, ఎంపీటీసీ తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● అడ్డాపుశీల పంచాయతీ పరిధి, గోపాలపురం పంచాయతీ పరిధిలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశంపార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు.


పార్టీలో చేరిన వారికి కండువా వేసి పార్టీలకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ప్రతి గ్రామంలో పసుపు జెండా ఎగరాలి

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో పసుపు జెండా ఎగరాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. గురువారం పార్టీ మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా గుమ్మలక్ష్మీపురంలో ఎల్విన్‌పేట కూడలి వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీఎస్ఆర్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కెన మధుసూదనరావు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్, కొమరాడ మండల పార్టీ అధ్యక్షుడు ఉదయ్‌శేఖర్‌పాత్రుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వరి

పార్టీని మరింత బలోపేతం చేయాలి

● ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింతగా బలోపేతం చేయాలని ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ సంస్థలకు నియమితులైన పార్టీ శ్రేణులతో స్థానిక కోటలో గురువారం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులంతా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు

బాధ్యతగా పనిచేయాలి

● ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పార్టీ మండల, గ్రామ క్లస్టర్, యూనిట్, వార్డు, బూత్ కమిటీల ప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. గురువారం వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను ప్రతీ ఒక్కరు తప్పకుండా నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా పోలినాయుడు, ఐవీపీ రాజు, బొద్దల నరసింగరావు, రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

క్రమశిక్షణతో మెలగాలి

● ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

చీపురుపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో మెలిగి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సూచించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కమిటీ ఇన్‌చార్జిలతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. కళా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, పార్టీ రాష్ట కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, రౌతు కామునాయుడు, కోట్ల మోతీలాల్ నాయుడు, సారేపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.


నాయకుల చేత ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే కళా

కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తింపు

● ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు.. ఎమ్మెల్యేతో పాటు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు, కోళ్ల శ్రీను, గొంప వెంకటరావు, డోకుల అచ్చంనాయుడులతో పాటు రత్నాజీ, మల్లా రామకృష్ణ, ఆర్.చంద్రశేఖర్, జీఎస్.నాయుడు, చొక్కాకుల మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేసిన 5 మండలాల నూతన కార్యవర్గం

ఓటర్ల జాబితాలను సిద్ధం చేయండి


మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 50 డివిజన్ల పరిధిలోని ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందని కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. గురువారం కార్పొరేషన్‌లోని సమావేశమందిరంలో బూత్ లెవెల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో నమోదైన ఓటర్లను 2025తో సరిపోల్చే విధానాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం వారు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సహాయ కమిషనర్ అప్పలరాజు ఉన్నారు.

బకాయిల వసూళ్లపై చర్యలు

భోగాపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): చేపలకంచేరుకు చెందిన 240 మంది మహిళలు బ్యాంకు నుంచి రూ.2 కోట్ల మేర రుణాలు తీసుకుని తిరిగి చెల్లించక పోవడం తో సంబంధిత అధికారులు సొమ్ము వసూళ్లకు గురువారం చర్యలు చేపట్టారు. 2022లో డీసీసీబీ బ్యాంకు నుంచి వెలుగు ద్వారా చేపలకంచేరుకు చెందిన మహిళలు రూ.2 కోట్లు రుణాలు తీసుకున్నారు. అయితే వాటిని వారు తిరిగి చెల్లించలేదు. దాంతో వాటిని వసూళ్ల చేయడానికి డీసీసీబీ భోగాపురం శాఖ మేనేజర్ బెహరా రమేష్, ఏపీఎం శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి సంఘ సభ్యులతో చర్చించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బకాయిలు చెల్లించి బ్యాంకుకు సహకరించాలని కోరారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారితో పాటు సూపర్‌వైజర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, భోగాపురం ప్యాక్స్ సీఈవో ఈశ్వరరావు, సీసీలు శ్రీనివాసరావు, సత్యనారాయణ ఉన్నారు.

విశాఖ-అరకు రోడ్డుకు మరమ్మతులు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంతలను పూడుస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పాడైన విశాఖ-అరకు రోడ్డుకు సంబంధిత అధికారుల మరమ్మతులు చేయించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆ రోడ్డు ఛిద్రం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారి వెంబడి గుంతలను పూడ్చారు.

సచివాలయ ఉద్యోగులు అలర్ట్

రేగిడి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థ పనితీరు, లోపాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు సచివాలయ ఉద్యోగులు, అధికారులు అలర్ట్ అయ్యారు. ఎంపీడీవో శ్యామకుమారి పలువురు ఉద్యోగుల నుంచి వివరణ కోరారు. సచివాలయ ఉద్యోగులు వేళలు పాటించాలని, నిర్దేశిత విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించినట్టు తెలిసింది.

రైతులకు ఇబ్బంది కలగనీయవద్దు

సంతకవిటి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బంది కలగనీయవద్దని తహసీల్దారు బి.సుదర్శన రావు అన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించాలని ఆయన ఆదేశించారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల వ్యవసాయ సిబ్బంది, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీలు చేసుకోవాలన్నారు. అవసరమైన బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్ద తు ధరకే కొనుగోలు చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబం ధిత అధికారులకు తెలియజేయాలన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

లక్కవరపుకోట, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): చందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒక క్రీడాభిమాని 30 జతల క్రీడా దుస్తులను గురువారం వితరణ చేశారని పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. క్రీడలపై విద్యార్థులు ఆకర్షితులయ్యేలా వారిని ప్రోత్సహించాలని ఆయన కోరారన్నారు. విద్యార్థులకు దుస్తులు అందించిన అభిమానిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

బొడ్డేపల్లికి 'ప్రెస్టిజియస్' అవార్డు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): నిరంతర రక్తదాత, మాజీ వాయు సైనికుడు బొడ్డేపల్లి రామకృష్ణరావుకు ప్రెస్టిజియస్‌కు బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో ఆయనను గురువారం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో జిల్లా సంక్షేమాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారి మాట్లాడుతూ ఒక మాజీ సైనికుడుకి అరుదైన గౌరవం దక్కడం గొప్పవిషయమన్నారు. 193 సార్లు రామకృష్ణ రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి సత్యం, జిల్లా సైనిక బోర్డు సిబ్బంది గవర లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అడిషనల్ పీవోగా సన్యాసమ్మ

రాజాం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): రాజాం ఐసీడీఎస్ అడిషనల్ పీడీగా చౌదరి సన్యాసమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె రాజాం ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేసి పదోన్నతిపై కృష్ణా జిల్లా పామర్రు సీడీపీవోగా బదిలీపై వెళ్లారు, అక్కడ నుంచి తిరిగి ఆమె అడిషనల్ పీవోగా బదిలీపై ఇక్కడకు వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): రాచకిండాం ఫీడర్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ ఆర్.శంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

16న కొప్పల వెలమల వనసమారాధన

విజయనగరం కలెక్టరేట్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయిర్ వద్ద ఈనెల 16న ఉమ్మడి జిల్లా కొప్పల వెలమ సంక్షేమ సంఘం వన సమారాధనను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, ఉపాధ్యక్షుడు పెంట స్వామి నాయుడు తెలిపారు. గురువారం స్థానిక కొప్పలవెలమ భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. రెండు జిల్లాలకు చెందిన కొప్పల వెలమ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలోవనసమారాధనకు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు బొత్స ప్రసాద్, కిలపర్తి రామకృష్ణ, వేమలి చైతన్య, రొంగలి ఎర్నినాయుడు ఉన్నారు.

క్రీడా మైదానం చదును

శృంగవరపుకోట, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని చదును చేసే పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే లలితకుమారి ఆదేశాల మేరకు పంచాయతీ మూడో వార్డు సభ్యుడు, టీడీపీ నాయకుడు కాపుగంటి శ్రీనివాసరావు, నియోజకవర్గ టీడీపీ యూత్ అధ్యక్షుడు వాకాడ భరత్ పర్యవేక్షణలో యంత్రాలతో చదును చేయించారు.

టిప్పర్‌కు రూ.25 వేలు జరిమానా

మెంటాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను జాతీయ రహదారిపై బుధవారం ఆంధ్ర పోలీసులు పట్టుకున్నారు. దాన్ని ఆంధ్ర ఎస్‌ఐ సీతారాం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దాంతో తహశీల్దార్ అరుణకుమారి గురువారం టిప్పర్‌కు రూ.25 వేలు జరిమానా విధించారు. ఇసుకను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నవీన్‌కు అప్పగించారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

నెల్లిమర్ల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం నెల్లిమర్లలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి నజీర్, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ తదితరులతో కలిసి పలు విభాగాల బాధ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీ పుట్టిందన్నారు. అదే సిద్ధాంతంతో గత 42 ఏళ్లుగా పార్టీ పనిచేస్తోందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ఏడుపదుల వయస్సు దాటినా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా పార్టీ అన్ని విభాగాల బాధ్యులు నిరంతరం కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పల నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, మండల కమిటీల అధ్యక్షులు మహంతి శంకరరావు, పల్లె భాస్కరరావు, కర్రోతు సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆకిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిని పెంచి.. ఆర్థికంగా ఎదగండి


శిబిరంలో ఎమ్మెల్యే నాగమాధవి

డెంకాడ, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): రైతులు పాల ఉత్పత్తిని పెంచుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గుండాలపేటలో గురువారం సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. అనంతరం రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఏర్పాటైన ఉచిత గర్భాశయ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అక్కడ నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ వంటి కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకంగా నిలుస్తున్నాయన్నారు. మా కూటమి ప్రభుత్వం ప్రతీ రైతు, ప్రతీ పశుయజమానిని ప్రోత్సహించేందుకు అంకితభావంతో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఎంపీడీవో వై.భవాని, జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ మురళీకృష్ణ, ఉప సంచాలకుడు డాక్టర్ రాధాకృష్ణ, భోగాపురం సహాయ సంచాలకుడు మహాపాత్రో, పశువైద్యుడు శ్రీకాంత్, వ్యవసాయాధికారి సంగీత, జనసేన నాయకుడు భవిరిశెట్టి శ్రీనివాసరావు, పైల శంకర్, అట్టాడ ప్రమీల, సిరికి అప్పారావు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ


శిబిరాన్ని పరిశీలిస్తున్న కో-ఆర్డినేటర్

గరివిడి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు అన్నారు. గురువారం కొండపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల మంజూరుకు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 4999 మంది దివ్యాంగ విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఇందులో భవిత కేంద్రాల ద్వారా 546 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే 270 మంది విద్యాంగులకు ఇంటివద్ద విద్య, 236 మందికి ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో నియోజకవర్గ పరిధిలోని 115 మంది వివిధ ఉపకరణాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.రామారావు, డి.అప్పన్న, హెచ్‌ఎం డి.రాము, సహ కో-ఆర్డినేటర్ ఎం.భారతి పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించండి


వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ

గరివిడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శారదదేవి అన్నారు. గురువారం దువ్వాం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పండ్ల తోటల పెంపకంనకు రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరేలా ఉపాధి సిబ్బంది పనిచేయాలన్నారు. పొలాల గట్లపై కూడా మొక్కలు వేసుకోవచ్చునన్నారు. కనీసం వేతనం రూ.370 వచ్చే విధంగా పనిచేయాలని వేతనదారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏపీవో ఉన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రాజాం/రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న గుంటూరులోని హిందూ ఫార్మా కళాశాల ఆవరణలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను బ్రాహ్మణ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాజాం, చీపురుపల్లి బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు టి.శ్రీరామ్మూర్తి, కె.తిరుమలేశ్వర రావు కె.మధు, కె.వి.ఎస్.కె.జె.శర్మ, రంపా జగదీశ్వర్రావు శర్మ విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెన్త్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, బి ఫార్మశీ, ఎం.ఫార్మశీ, డిగ్రీ పూర్తి చేసినవారు మేళాకు హాజరు కావచ్చన్నారు. మేళాలో 50లకు పైబడి కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని. వెయ్యికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. వివరాలకు సంఘ అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ (988529666), బి.రవి (6309966644), రాజశేఖర్ (9491526678)లను సంప్రదించవచ్చునన్నారు.

'మన డబ్బులు-మన లెక్కలు'కు చర్యలు

రాజాం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మన డబ్బులు మన లెక్కలు యాప్ అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి, స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చిట్టిబాబు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రౌతు వెంకటమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రికవరీ అయిన డబ్బును తిరిగి రొటేషన్ పద్ధతిలో అప్పులు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో 5808 సంఘాల పరిధిలో 64,862 మంది సభ్యులకు మన డబ్బులు-మన లెక్కలు యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భవాని, స్త్రీనిధి మేనేజరు సుధాకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణపై సమావేశాలు


వసి గ్రామంలో ఆత్మీయ సమావేశం దృశ్యం

ఎస్.కోట రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో వైసీపీను వీడి టీడీపీలో చేరిన ప్రస్తుత టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణితో పాటు ఆమె వర్గానికి చెందిన నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు. గురువారం తిమిడి, వసి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ టీడీపీలో చేరేటప్పుడు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి లోకేశ్ ఇచ్చిన హామీ, 18 నెలలుగా జరుగున్న అన్యాయంపై మాట్లాడారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామాల్లో తమకు ఉన్న పట్టుపోతుందని వాపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా ముందుకు వెళ్దామనే దానిపై చర్చిస్తున్నామన్నారు. బొడ్డవరలోని జిందాల్ నిర్వాసితులకు స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి మద్దతుగా నిలిచి వారిలో ఆత్మవిశ్వాసం పెంచుదామని పలువురు నాయకులు, పెద్దలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఆమెతో పాటు ఎంపీపీ సోమేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ సంతోష్ కుమారి, కారుకొండ వెంకటరావు, ఒబ్బిన సతీష్ తదితరులున్నారు.

రాముది ఆత్మహత్యే: సీఐ

చీపురుపల్లి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పత్తికాయవలసకు చెందిన ఎలకల రాము ఆత్మహత్య చేసుకున్నట్టు సాంకేతికంగా రూఢీ అయ్యిందని సీఐ శంకర రావు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక తమకు అందిందన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికాయవలసకు చెందిన ఎలకల రాము గత నెల 8న నుంచి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు వెతికార న్నారు. అయతే 10న పుర్రేయవలస సమీపంలో నేల బావిలో రాము శవమై తేలాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మొదట ఆత్మహత్యగా కేసు నమోదు చేశామన్నారు. మృతుడి తండ్రి రమేశ్ పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో దర్యాప్తు చేపట్టామన్నారు. పోస్ట్‌మార్టం రిపోర్టు, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా రామును ఎవరూ హత్య చేయలేదని, తనకు తానుగానే బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు తేలిందని సీఐ వెల్లడించారు. సమావేశంలో ఎస్‌ఐ దామోదరరావు ఉన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేయండి

ఎస్.కోట రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమకు అక్రమంగా కట్టబెట్టిన భూముల రిజిస్ట్రేషన్లను కలెక్టర్ వెంటనే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. ఆ భూములను రైతులకు వెంటనే అప్పగించాలన్నారు. గురువారం మండలంలోని జిందాల్ నిర్వాసితులు చేపడుతున్న నిరసన దీక్షలో గురువారం 152వ రోజు ఆయన పాల్గొన్నారు. తమను ప్రభుత్వాలు, అధికారులు మోసం చేస్తున్నారంటూ నిర్వాసితులు ఆకులు, అలములు పట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి


ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

గజపతినగరం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని డీఎల్‌డీవో కిరణ్ కుమార్ అన్నారు. గురువారం పురిటిపెంట, గజపతినగరం సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుకు సంబంధించి డిసెంబరు 31 నాటికి శతశాతం చెల్లింపులు చేపట్టాలన్నారు. స్వర్ణ పంచాయతీ యాప్ స్కానర్‌తో క్యాష్‌లెస్‌లో విధానంలో చెల్లింపులు చేపట్టాలన్నారు. బొబ్బిలి డివిజన్ పరిధిలో 8 మండలాలకు సంబంధించి రూ.3.70 కోట్లు ఇంటి పన్ను వసూలు కావల్సి ఉందన్నారు. గతంలో మార్చి 31వరకు గడువు ఉండేదని ఇప్పుడు 3 నెలలు ముందే చెల్లించాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో కల్యాణి, ఈవోపీఆర్‌డీ జనార్దనరావు ఉన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ


తరగతి గదిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

రేగిడి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): సంకిలి, ఎ.వి.పురం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన టెన్త్ పరీక్ష కేంద్రాలను గురువారం చీపురపల్లి డిప్యూటీ డీఈవో కె.వి.రమణ పరిశీలించారు. గదులు, మౌలిక సదుపాయాలు, రవాణా తదితర అంశాలపై ఎంఈవో వరప్రసాదరావు, బి.ఎరకయ్యలతో ఆయన మాట్లాడారు. అంతక ముందు ఈ పాఠశాలల స్థితిగతులు, విద్యా ప్రమాణాలపై హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, రామినాయుడులతో సమీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, మెనూ అమలును పరిశీలించారు. ఆయన వెంట డీసీఈబీ ఛైర్మన్ సన్యాసిరాజు, ఆదినారాయణ ఉన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించండి

భోగాపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో మాణిక్యాలనాయుడు అన్నారు. రెడ్డికంచేరు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులతో డీఈవో మాట్లాడి పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం అమటాంరాయవలస, పెన్నింటిపాలెం ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు ఎంఈవో రమణమూర్తి, చంద్రమౌళి పాల్గొన్నారు.

కో-లొకేటెడ్ అంగన్‌వాడీలపై చర్చ

● పైలెట్ ప్రాజెక్టుగా భోగాపురం ఎంపిక


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో, ఐసీడీఎస్ పీవో

భోగాపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): కో-లొకేటెడ్ అంగన్‌వాడీ కేంద్రాలపై (ప్రాథమిక పాఠశాలకు అంగన్‌వాడీ కేంద్రాన్ని అనుసంధానం చేయడం) డీఈవో వి.మాణిక్యాల నాయుడు, ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి గురువారం విద్యా వనరుల కేంద్రంలో చర్చించారు. నూతన విద్యా విధానంలో భాగంగా సమగ్ర అభివృదికి ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భోగాపురం మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించి విద్యా శాఖ, ఐసీడీఎస్ అధికారులు చర్చలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో, ఐసీడీఎస్ పీవో మాట్లాడుతూ మండలంలో 91 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా పాఠశాలకు 300 మీటర్లలోపు 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో 12 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే కో-లొకెటెడ్‌గా మారనున్నాయన్నారు. ఈ విధానంతో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు 1వ తరగతి నుంచి అదే ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమణమూర్తి, బి.చంద్రమౌళి, ఐసీడీఎస్ సీఈపీవో లావణ్య, సూపర్‌వైజర్లు హేమ, శ్రీదేవి, ఎంఐఎస్ సూర్యనారాయణ, సీఆర్‌పీలు భాస్కరరావు, కనకరాజు రాజారావు పాల్గొన్నారు.

ఎవరు వదిలిపెట్టి వెళ్లారో?

● పెద్దాసుపత్రి బయట అచేతనావస్థలో వృద్ధుడు

● పట్టించుకోని కుటుంబ సభ్యులు, సిబ్బంది


రక్తం మడుగులో వృద్ధుడు

విజయనగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దాస్పత్రి సమీపంలో మదర్ థెరిసా సాక్షిగా.. ఓ వృద్ధుడు ప్రాణాపాయ స్థితిలో కనిపించారు. ఓర్చుకోలేని బాధతో కొట్టుమిట్టాడుతున్నారు. ఆ వృద్ధుడిని ఇటు కుటుంబ సభ్యులు.. అటు పెద్దాస్పత్రి సిబ్బంది పట్టించుకోలేదు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. బొండపల్లి మండలం అంబటివలస గ్రామానికి చెందిన రాజాన సూరి (80)కి మూత్రం స్తంభించటంతో కొన్ని రోజుల కిందట కుటుంబ సభ్యులు పెద్దాస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత ఆ వృద్ధుడికి కుటుంబ సభ్యుల జాడే కరువైంది. తర్వాత ఏం జరిగిందో ఏమో గురువారం ఉదయం అతడికి శస్త్రచికిత్స చేసి వేసిన కుట్లు తెగిపోయాయి. రక్తస్రావం అవుతోంది. ఆసుపత్రి ఆవరణలోని మదర్ థెరిసా విగ్రహం వద్ద పడి ఉన్నాడు. భరించలేని నొప్పితో మూలుగుతున్నాడు. ఉదయం నుంచి రోదిస్తున్నాడు. చుట్టుపక్కల జనం అతడికి భోజనం అందిస్తున్నారే గానీ ఆసుపత్రిలోకి తరలించే వారే కరువయ్యారు. అదే దారిలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది రాకపోకల సాగిస్తున్నారు. కానీ వృద్ధుడిని ఎవ్వరూ సాయంత్రం వరకూ పట్టించుకోలేదు. సాయంత్రం 6 గంటల తర్వాత వృద్ధుడు అక్కడ కనిపించలేదు. ఆ సమీపంలోని వారిని అడిగితే తెలియదనే సమాధానం వచ్చింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సాయి (ఫైల్)

నెల్లిమర్ల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకు పర్యాటక ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానిక చెందిన బొంతు సాయి (22) దుర్మరణం చెందాడు. దాంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. విజయనగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సాయి తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై బుధవారం అరకు వెళ్లినట్టు గ్రామస్థులు చెప్పారు. తన స్నేహితుడు గదిలో ఉండగా సాయి ఒక్కడే ద్విచక్ర వాహనంపై టిఫిన్ తెచ్చేందుకు బయటకు వచ్చాడు. డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో సాయి అక్కడికక్కడే మృతి చెందినట్టు చెబుతున్నారు. సాయి తల్లిదండ్రులు బొంతు పైడిరాజు, శ్రీదేవి వ్యవసాయ కూలీలు. మృతుడికి సోదరుడు ఉన్నాడు.

లారీని ఢీకొని వ్యాన్ డ్రైవర్..

భోగాపురం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై లింగాలవలస వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం గంజాంకు చెందిన ప్రదీప్‌కుమార్ డిషొయ్(46) అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్‌ఐ పాపారావు తెలిపారు. ప్రదీప్‌కుమార్ విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వైపు వ్యాన్‌తో వెళ్తున్నాడు. లింగాలవలస సమీప జాతీయ రహదారిపై అదే రహదారిలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొనడంతో వ్యాన్ నడుపుతున్న ప్రదీప్‌కుమార్ అక్కడక్కడే మృతి చెందాడు. మృతుడి అన్నయ్య ప్రతాప్‌కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమెదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మతిస్థిమితం లేని వ్యక్తి..

బొబ్బిలి/రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంసీ సమీపంలో కొద్ది రోజులుగా తిరుగుతున్న మతి స్థిమితం లేని వ్యక్తి గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆ ప్రాంతంలోని హైటెన్షన్ విద్యుత్ వైర్ల టవర్ ఎక్కి తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడి నుంచి కిందపడటంతో కాళ్లు, చేతులు విరిగిపోయాయి. సీఐ సతీష్‌కుమార్ హెచ్‌సీ కాశీని అప్రమత్తం చేశారు. క్షతగాత్రుడిని సీహెచ్‌సీకి తరలించే ఏర్పాటు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందాడని సీఐ తెలిపారు. అతడు ఈ ప్రాంతానికి చెందినవాడు కాదని, హిందీలో మాట్లాడుతూ యాచించే వాడని సీఐ తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఐదుగురు వ్యక్తులపై ఈనెల 12న నమోదైన అట్రాసిటీ కేసుపై చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు రాజాంలో గురువారం విచారణ చేపట్టారు. పట్టణానికి చెందిన రెల్లి సామాజికవర్గానికి చెందిన ప్రేమ్‌కుమార్‌ను గొల్ల సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు యువకులు కులం పేరుతో దూషించి తీవ్రంగా గాయపరచడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దాంతో గురువారం రాజాం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రేమ్‌కుమార్‌తో డీఎస్పీ రాఘవులు మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుడి తల్లిదండ్రులు, బంధువుల నుంచి సమాచారాన్ని సేకరించారు. దాడి చేసిన ప్రాంతాన్ని, కళాశాలను డీఎస్పీ పరిశీలించి పలువురితో మాట్లాడారు. ఆయనతో పాటు టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఉన్నారు.

పట్టుబడిన ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు

పూసపాటిరేగ, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు కొంతకాలంగా జరుగుతున్నాయి. వాటిని చోరీకి పాల్పడిన వారిని గురువారం కందివలసగెడ్డ వద్ద పోలీసులు పట్టుకున్నారు. కొన్ని రోజుల కిందట మండలంలో ఎస్ఎంఎస్ పరిశ్రమలో సుమారుగా రూ.లక్ష విలువచేసే కేబుల్ వైర్ దొంగతనం జరిగినట్టు పరిశ్రమదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై దర్యాప్తు నిర్వహిస్తున్న పోలీసులు గురువారం ఓ వాహనంలో కేబుల్ వైర్ తరలిస్తుండటాన్ని గుర్తించారు. ఏడుగురు వ్యక్తులను ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మండలంలో వరుస చోరీకి గురైన 20 ట్రాన్స్‌ఫార్మర్లను వీరే చోరీ చేసినట్టుట బయటపడింది. అదుపులోకి తీసుకొన్న వారిలో ఇద్దరు మహిళలు ఉండటం విశేషం.

గంజాయి విక్రయదారుల అరెస్టు

విజయనగరం క్రైం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యాసనారాయణ మెట్ట సమీపంలోని గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఏడున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం పోలీసులకు వచ్చిన సమాచారంతో ఆ ప్రాంతానికి చేరుకుని గంజాయిని విక్రయించేందుకు సిద్ధంగా వైఎస్‌ఆర్ నగర్‌కు చెందిన మల్లిబోయిన మురళీకృష్ణ, కొత్తపేట యాదవ వీధికి చెందిన మక్కిళ్ల పవన్‌కుమార్, రణస్థలానికి చెందిన గణేశ్వరం సంజయ్ కుమార్, యాగాటి గణేష్, బాబామెట్ట పీవీజీ నగర్‌కు చెందిన పడగల రాజేశ్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. దాంతో వారు నేరం చేసినట్లు అంగీకరించారని సీఐ తెలిపారు. దాడిలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ కనకరాజు, హెచ్‌సీ తిరుపతి, రామునాయుడు ,వి.కృష్ణ, శ్రీనివాసరావులను సీఐ అభినందించారు.

కుష్టు వ్యాధిపై సమగ్ర సర్వే చేయండి

లక్కవరపుకోట (కొత్తవలస), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో కుష్టు వ్యాధిపై సమగ్ర సర్వే నిర్వహించాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. గురువారం పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లతో ఎల్‌సీడీసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవో నరసింహరావు, నోడల్ పర్సన్ ఈశ్వరరావు, పీహెచ్‌ఎన్ జగదాంబ, హెచ్‌ఏ సత్యారావు, హెచ్‌వీ పద్మావతి ఉన్నారు.

వారు లేరు.. వీరు రారు?

(ఐదో పేజీ తరువాయి)

నేత్ర (ఆప్తాలిమిస్ట్), సివిల్ సర్జన్ (సీఎస్ ఆర్ఎం) విభాగాలకు సంబంధించి వైద్యాధికారుల పోస్టులు కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. చర్మ, నేత్ర, ఇతర ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యసేవలు అందకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

సెలవుల్లో చిన్నపిల్లల వైద్యులు..

ఆసుపత్రిలో ఇద్దరు చిన్నపిల్లల వైద్యులు గత కొంత కాలంగా మెడికల్ లీవ్‌లో ఉన్నారు. వైద్యాధికారి వెంకట్రావు అనారోగ్య సమస్యలతో 2023లో పార్వతీపురానికి డెప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. మరో చిన్నపిల్లల వైద్యాధికారి రవీంద్ర మూడు నెలల డెప్యుటేషన్‌పై సీతంపేట ఆసుపత్రికి వచ్చారు. రెగ్యులర్ వైద్యాధికారి మనోజ్‌తో పాటు రవీంద్ర అపడమిక్ సీజన్‌లో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించారు. అయితే ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా మనోజ్, రవీంద్ర వేరేచోటకు బదిలీ అయ్యారు. వీరిస్థానంలో రాజాం నుంచి వైద్యుడు కోటేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈయన నెలరోజుల పాటు ఇక్కడ పనిచేసి మెడికల్ లీవ్ పెట్టి వెళ్లిపోయారు. దీంతో ఆస్పత్రిలో చిన్నవైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఎన్ఆర్‌సీ (పౌష్టికాహార పునరావాస కేంద్రం)వైద్యులతో చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

చిన్నారుల్లో బ్లడ్ ఇన్‌ఫెక్షన్..

ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా చిన్నారులు బ్లడ్ ఇన్‌ఫెక్షన్‌కు గురవుతున్నారు. సీతంపేట ఆసుపత్రికి సోమ, మంగళ, బుధవారం కలిపి చిన్నారుల ఓపీ 125వరకు నమోదైంది. వీరిలో 30మందికి పైగా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. జ్వరం, బ్లడ్ ఇన్‌ఫెక్షన్, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో ఎక్కువగా చిన్నారులు ఏరియా ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. వీరితో పాటు ఐటీడీఏ పరిధిలోని పలు ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కూడా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

పట్టించుకోని వైద్యశాఖ..

సీతంపేట ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తున్నా వైద్యశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో ఎన్‌సీడీ, ఎన్ఆర్‌సీకి ప్రత్యేక వైద్య నిపుణులు ఉండాల్సి ఉంది. పలు విభాగాల్లో 20మందికి పైగా సిబ్బంది ఉండాలి. కానీ 16పోస్టుల వరకు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యులతో పాటు సిబ్బందిని కూడా నియమించాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులు సెలవుపై ఉన్నప్పటికీ ఆరోగ్య సమస్యలతో వచ్చే చిన్నారులకు ఎన్ఆర్‌సీ వైద్యులతో సేవలందిస్తున్నాం. చర్మ, నేత్ర, సివిల్ సర్జన్, ఇతర సిబ్బంది పోస్టుల భర్తీ కోసం ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం.

-బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, సీతంపేట

దీర్ఘకాల సమస్యలకు మోక్షమెప్పుడో?

(ఐదో పేజీ తరువాయి)

నిర్మాణం కోసం ఎటువంటి ప్రకటన రాలేదు. పట్టణంలో రహదారి విస్తరణకు సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తయింది. ఈ పనులు చేపట్టిన సమయంలోనే బైపాస్ రహదారి నిర్మాణం కూడా చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన..

కురుపాం నియోజకవర్గంలో పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. నిధులున్నా పనులు ముందుకు సాగడం లేదు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 80 శాతం వరకూ ఈ వంతెన పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దీని నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో సుమారు 30 గ్రామాల ప్రజలు ఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగావళి నది దాటలేక.. చుట్టూ తిరిగి స్వగ్రామాలకు చేరుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాల ప్రజలు నాటు పడవను ఆశ్రయించి ప్రమాదకర స్థితిలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ సమస్యను మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. అయితే నెలలు గడుస్తున్నా.. పనులు ప్రారంభించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పంచాయతీరాజ్‌శాఖ జిల్లా ఇంజనీరింగ్ అధికారి నగేష్ బాబును వివరణ కోరగా.. 'ఇప్పటివరకు రెండుసార్లు టెండర్లు పిలిచినా.. ఎవరూ ముందుకు రాలేదు. మూడోసారి టెండర్ నిర్వహించేందుకు ప్రభుత్వానికి లేఖ రాశాం. అనుమతులు వచ్చిన వెంటనే ప్రక్రియ నిర్వహిస్తాం.' అని తెలిపారు.

జంఝావతి పరిస్థితి ఇదీ..

జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు జంఝావతి ప్రాజెక్టు పెండింగ్ పనులు కూడా పూర్తవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా..ఒడిశా రాష్ట్రంతో ఉన్న వివాదాలు పరిష్కారం కావడం లేదు. దీంతో ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. శివారు ప్రాంత రైతులు వరుణుడిపై ఆధారపడి సాగుచేసుకోవాల్సి వస్తోంది. 24 వేల ఎకరాలకు గాను ప్రాజెక్టు ద్వారా కేవలం 7వేల ఎకరాలకే సాగునీరు అందుతుంది. ప్రస్తుతం జంఝావతి ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్‌తో పాటు మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒడిశాతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంతో ఉన్న వివాదాన్ని పక్కన పెట్టి.. స్థానిక వనరులను ఉపయోగించుకుని వ్యవసాయ భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్రమత్తతే మందు

(ఐదో పేజీ తరువాయి)

వ్యాయామం లేకపోవడం, బరువు ఎక్కువగా ఉండటం, ఒత్తిడి, నిద్రలేమి. దీనిని 'నాన్ ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్' అంటారు.

లక్షణాలివీ..

తరచూ మూత్రానికి వెళ్లడం. ఎక్కువ దాహం వేయడం. బరువు తగ్గడం. అలసట, నిద్రలేమి, చిన్నగాయాలు త్వరగా మానకపోవడం, చూపు మసకబారడం.. వంటివి డయాబెటిస్ లక్షణాలు. వారసత్వంగా కూడా కొందరికి డయాబెటిస్ వస్తుంది. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే రక్తంలో చక్కెర స్థాయి పరీక్ష (బ్లడ్ షుగర్ టెస్ట్) చేయించుకోవాలి.

- ఉదయం ఆహారం తినకముందు ఎఫ్‌బీఎస్(ఫాస్టింగ్ బ్లడ్ షుగర్) పరీక్ష చేయించుకోవాలి. ఇది సాధారణంగా 100 ఎంజీ/డీఎల్ లోపు ఉండాలి.
- భోజనం చేసిన రెండు గంటల తర్వాత పీపీబీఎస్(పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ షుగర్) పరీక్ష చేయించాలి. 100-125 ఎంజీ/డీఎల్‌గా ఉంటే ప్రీ డయాబెటిస్.
- గత మూడు నెలల్లో రక్తంలోని సగటు చక్కెర స్థాయిలు తెలుసుకోవడానికి హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయించాలి. ఇది 126 ఎంజీ/డీఎల్ పైగా ఉంటే డయాబెటిస్ అని భావిస్తారు
- డయాబెటిస్ ఉన్నవారు రోజుకి కనీసం 7-8 గంటలు నిద్రపోవాలి. ధ్యానం, స్లో బ్రీతింగ్(దీర్ఘంగా శ్వాస తీసుకోవడం) మంచి ఉపశమనాన్ని ఇస్తాయి. నెలకోసారి బ్లడ్ షుగర్ టెస్ట్ చేయించుకోవాలి. మందులు వాడాలి. కళ్లు, కాళ్లు, హృదయం.. ఇవి షుగర్ వల్ల ఎక్కువ ప్రభావితమవుతాయి. అందుకే సమయానికి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సాలూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చురుగ్గా లేని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన గురువారం కొత్తవలస, మామిడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి అందుకనుగుణంగా వారికి తర్ఫీదునివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల ప్రాంగణంలో పరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. మామిడిపల్లి పీహెచ్‌సీని పరిశీలించి రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందుతున్నది లేనిది ఆరా తీశారు.



కొత్తవలస ఆశ్రమ పాఠశాలలో వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి

క్రీడల్లో రాణించాలి

సీతంపేట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన గిరిజన విద్యార్థులను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్, శ్రీకాకుళం అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ గురువారం అభినందించారు. ఈ పోటీల్లో అన్ని విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుచుకున్న సందర్భంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విద్యార్థులు సాధించిన షీల్డ్‌లను పీవో వారికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు చదువుతో పాటు అన్ని క్రీడల్లో రాణించి ఐటీడీఏకు మంచి పేరు తీసుకువస్తున్నారని కొనియాడారు. ఆసక్తి కలిగిన క్రీడల్లో విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో ఆర్‌వీ గణేష్, డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, సూపరింటెండెంట్ అప్పారావు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్, శ్రీకాకుళం అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ తదితరులు

ఆధ్యాత్మిక సందడి

జిల్లాలో గురువారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. అయ్యప్ప భక్తులు హిందూ ధర్మ ప్రచార రథయాత్ర నిర్వహించారు.



వీరఘట్టం:కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

లక్ష్మీనృసింహస్వామికి పూజలు

సీతానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామికి గురువారం అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ముడుపుల పూజలు, అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

దేవతామూర్తుల ఊరేగింపు

వీరఘట్టం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో గురువారం శబరిమల హరి హరిత్మజ నూతన దేవాలయం ప్రారంభోత్సవం జరిగింది. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో దంపతులు పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవతామూర్తుల ఊరేగింపు పురవీధుల్లో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచార రథయాత్ర



ధర్మ ప్రచార రథయాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

పాలకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప భక్తులు హిందూ ధర్మ ప్రచార రథయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. పాలకొండ భక్తజన బృందం, అయ్యప్ప మాలధారులు మూర్తి, రుద్ర కోటేశ్వరరావుతో పాటు వందలా ది మంది అయ్యప్ప, శివ, భవానీ భక్తులు కోటదుర్గమ్మ గుడి నుంచి కొండాపురం అయ్యప్పస్వామి దేవాలయం, గాయ త్రీదేవి ఆలయం వరకు రథయాత్ర నిర్వహించారు.

సింహాద్రి అప్పన్న రూపంలో అయ్యప్ప

సాలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు సింహాద్రి అప్పన్న రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని చూసేందుకు భక్తులు పోటీపడ్డారు. ● అయ్యప్ప ఆలయానికి రూ.లక్షను మంత్రి సంధ్యారాణి విరాళంగా అందించారు. సన్నిధాన స్థల సేకరణ కోసం రూ.50వేలు, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.50వేలు అందించారు.



అలంకరణలో స్వామివారు

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి హెచ్చరించారు. గురువారం రావుపల్లి, చినగుడబ, పెదగుడబ, వల్లరిగుడబ, సన్యాసి రాజుపేట గ్రామాల్లో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. రావుపల్లిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ షాపుల నుంచి బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేయవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఉల్లిభద్ర మద్యం దుకాణంపై అధికంగా ఆరోపణలు వస్తున్నాయన్నారు. గ్రామాల్లో సారా తయారీ, అమ్మకం చేస్తే సమాచారం అందించాలన్నారు. అలాగే నాణ్యతతో కూడిన మద్యం అమ్మకాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ దాడుల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలి

గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దుకాణదారులు ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం ఉల్లిభద్ర, గరుగుబిల్లి పంచాయతీల్లో దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనతో పాటు నోటీసులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్లాస్టిక్ సామగ్రిపై నిషేధం విధించిందన్నారు. నిబంధనలు అతిక్రమించి వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో ప్రజలకు కలిగే నష్టాలను వివరించారు. పర్యావరణానికి హాని కలిగించే చర్యలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. దుకాణదారులు రహదారులపై వ్యర్థాలు వేయకుండా చెత్త బుట్టల్లో వేయించేలా దృష్టి సారించాలన్నారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. వ్యర్థాలను విధిగా పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా సహకరించాలని అన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతా మార్చ్‌కు ఏర్పాట్లు

పార్వతీపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా పార్వతీపురంలో ఐక్యతా మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి తెలిపారు. ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లపై ఆమె తన చాంబర్‌లో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐక్యతా మార్చ్ నిర్వహించడానికి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్, జిల్లా క్రీడా ప్రాధికారిత అధికారి వాసుదేవరావు, డీఈవో రాజ్‌కుమార్, యూత్ వెల్ఫేర్ అధికారి ప్రేమ్‌భరత్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

వీరఘట్టం, న వంబరు 13 (ఆం ధ్రజ్యోతి): వీరఘ ట్టం సమీపంలో ఉన్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాం వద్ద ఖాళీ ధాన్యపు సంచుల తో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తూ తుప్పల్లోకి జారిపో యింది. లారీని వెనుకకు మళ్లించే క్రమంలో జారి తుప్పల్లోకి వెళ్లింది. ఆ సమయంలో వీరఘట్టం, పార్వతీపురం ప్రధాన రహదారిలో ఏ విధమైన వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



తుప్పల్లోకి జారిన లారీ

విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే

పార్వతీపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రోహిత్‌ను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం టీడీపీ కార్యాలయంలో శాలువతో సత్కరించారు. రాకెట్ సైన్స్, ఏరోనాటికల్ విభాగంలోని కొన్ని అంశాలను తెలుసుకొనేందుకు ఈ నెల 5న ఢిల్లీ వెళ్లిన రోహిత్ ప్రతిభ కనబరిచి అక్కడ అందరినీ ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాకెట్ సైన్స్ విభాగంలో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి జిల్లా ఖ్యాతిని దశ దిశలా వ్యాపించేలా చేయాలని అన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా సీఎం సహాయనిధి నిలుస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం రూ.1,69,979 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. సాలూరు మండలం మరిపల్లి గ్రామానికి చెందిన జడ త్రినాథకు రూ.41,539, పాచిపెంట మండలం పణుకువలసకు చెందిన తెలుగు వెంకటరమణకు రూ.93,440, మెంటాడ మండలం పెద్దమీడపల్లికి చెందిన సారకనా అచ్చియ్యమ్మకు రూ.35వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పార్వతీపురం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం లబ్ధిదారులకు అందించారు. సీతానగరం మండలం మండిపేటకు చెందిన సేనపతి అప్పలస్వామికి రూ.62,038, లచ్చయ్యపేటకు చెందిన వంజరాపు కళావతికి రూ.1,07,700, బలిజిపేట మండలం బలగరకు చెందిన పి.సంగీతరాణికి రూ.23,400 చెక్కులను అందించారు. ●కొమరాడ: పరశురాంపురం గ్రామానికి చెందిన ఎ.కృష్ణకు ఎమ్మెల్యే జగదీశ్వరి సీఎంఆర్ఎఫ్ చెక్కు రూ.1,05,196 అందించారు.

సందిమానుగూడ గ్రామస్థుల ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ విచారణ

వీరఘట్టం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ భూముల్లో ప్రైవేటు వ్యక్తులు సర్వే చేస్తున్నారని, వాటిని రక్షించాలని హుస్సేన్‌పురం రెవెన్యూ పరిధిలోని సందిమానుగూడ గ్రామస్థుల సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ విచారణ చేపట్టారు. గురువారం సందిమానుగూడ వెళ్లి గ్రామస్థులతో మాట్లాడారు. తహసీల్దార్ సాయి కామేశ్వరరావుకు తగు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. గుడ్లు తింటున్నారా, భోజనాలు బాగున్నాయా, చక్కగా చదువుతున్నారా అని విద్యార్థులను అడిగారు. కార్యక్రమంలో ఆర్ఐ రవితేజ, వీఆర్వో జె.రామారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలాజీ మెడికల్ స్టోర్‌పై..

పాచిపెంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ మెడికల్ జనరల్ స్టోర్‌పై గురువారం సాలూరు మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.శివకుమార్ విచారణ చేపట్టారు. అనధికారికంగా క్లీనిక్ నిర్వహిస్తున్నారని, వైద్యం నిర్లక్ష్యంగా చేస్తున్నారని ఆరోపిస్తూ ఈ నెల 10న పార్వతీపురం ఐటీడీఏ పీవోకు మోదుగ పంచాయతీ కొట్రగుడ్డికి చెందిన గెమ్మెల పోతలయ్య, భార్య లక్ష్మి ఫిర్యాదు చేశారు. మెడికల్ జనరల్ స్టోర్ నిర్లక్ష్యం కారణంగా తమ మూడు నెలల పాప మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్ శివకుమార్‌ను విచారణ అధికారిగా పీవో నియమించారు. విచారణ నివేదికను ఐటీడీఏ పీవోకు సమర్పిస్తామని శివకుమార్ తెలిపారు.

నేటి నుంచి సదరం ప్రారంభం

గరుగుబిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు సదరం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. గురువారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతులకు వైకల్య నిర్ధారణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు అవసరమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించి సచివాలయాల్లో సదరం నిర్వహణ జరుగుతుందన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గృహాల సర్వే వేగవంతం

సీతానగరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో గృహాల సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు అన్నారు. చినభోగిలి, తామరఖండి, కొత్తవలస గ్రామాల్లో జరుగుతున్న సర్వేపై సచివాలయ ఉద్యోగులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 1,748 గృహాలకు సర్వే చేశామని, మిగిలిన 1,349 గృహాలకు సంబంధించి సర్వే చేయాల్సి ఉందని అన్నారు. సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం చినభోగిలిలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ప్రీస్కూల్ పిల్లలకు పౌష్టికాహారాన్ని ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

పాలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులందరూ శక్తియాప్‌ను తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని శక్తిబృందం జి.ఝాన్సీబాయి, సీహెచ్.ప్రకృతాంబ, ఏ.రాము, పి.గణపతిరావు పేర్కొన్నారు. పనుకువలస, దుగ్గి, పొట్లి, ఆర్‌బీఆర్‌పేట, డోలమడ పాఠశాలల్లో గురువారం శక్తియాప్, బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న సమయంలో 112 నెంబర్‌కు కాల్‌చేసి తక్షణ సహాయం పొందాలని అన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పాలకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నవగాం గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ లావేటి ఉమామహేశ్వరరావు తన పుట్టినరోజు సందర్భంగా గురువారం గ్రామ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, నరేష్, కిరణ్, వంశీ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

బెలగాం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్యక్ర మంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్త లు తదితరులు పాల్గొన్నారు.

కమిటీల ఏర్పాటుపై చర్చ

పాలకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీల ఏర్పాటుపై నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ గండి రామినాయుడు, నాయకులు గుమ్మడి సింహాద్రి, మజ్జి జయశంకర్, రాజబాబు, జయలక్ష్మి పాల్గొన్నారు.